# కేసీఆర్ తెలంగాణను దేశానికి దిక్సూచిగా నిలిపారు

- అడగని పథకాలను అమలు చేసిన ఘనత బీఆర్ఎస్‌దే..
- పదేండ్ల వరకు కేసీఆర్ అధికారంలోకి రాదని భావిస్తే రేవంత్‌రెడ్డి రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సవాల్



వనపర్తి టౌన్, ఏప్రిల్ 30 : తెలంగాణ రాష్ట్ర సాధకుడు , రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పదేండ్ల పాలనలో తెలంగాణను దేశానికి దిక్సూచిగా నిలిపారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి స్పందిస్తూ మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అడగని పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. పదేళ్ల వరకు కేసీఆర్ అధికారంలోకి రారని రేవంత్‌రెడ్డి భావిస్తే దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి చరిత్రను మరిచిపోయి మాట్లాడుతున్నారన్నారు. కొడంగల్‌లో ఓడిపోయి మల్కాజిగిరి నమ్ముకున్న చరిత్ర రేవంత్‌రెడ్డిదని, అక్కడ సిట్టింగ్ స్థానంలో ఓడిపోయిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని అన్నారు. పదేండ్లు రేవంత్‌రెడ్డి అధికారంలో ఉండే సంగతి తర్వాత ఉన్న ఐదేండ్లు తెలంగాణను ఆగం చేయకుండా పాలిస్తే చాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రగల్భాలు పలుకుతున్నారని, పూటకో మాట మాట్లాడుతూ పథకాల అమలుకు మొఖం చాటేస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలు అమలు చేయకుండా వేధిస్తున్నారని, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారన్నారు. అమ్మఒడి ఎందుకు ఆగిందని, గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఆడబిడ్డ పుడితే రూ.13వేలు, మగబిడ్డ పుడితే రూ.12వేలు ఎందుకు ఇవ్వకుండా ఆపారని అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అల్పాహారం ఆపింది ఎవరని, కిశోర బాలికలకు హెల్త్ కిట్ ఎవరు మాయం చేశారని, కేసీఆర్ కిట్ ఎవరు ఎత్తుకెళ్లారని ప్రశ్నించారు. అధికారం కోసం అరచేతిలో వైకుంఠం చూపిన రేవంత్‌రెడ్డి హామీల అమలును ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతల మీద కేసులు, జైళ్లు, చావులు కోరుకుంటున్నాడన్నారు. శ్రీశైలం సొరంగం హడావుడి పనుల కారణంగా ఎనిమిది మందిని బలిగొన్నారని, కనీసం వారి శవాలను కూడా వారి కుటుంబాలకు అప్పగించకుండా సహాయక చర్యలు నిలిపివేశారని దుయ్యబట్టారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డిని హామీలు ఏమాయ్యాయని ప్రశ్నిస్తున్నది ప్రతిపక్షాల నేతలు కాదని ప్రజలేనని అని స్పష్టం చేశారు. ప్రజల ప్రశ్నలు తప్పించుకోవడానికి ప్రతిపక్షాలను రేవంత్‌రెడ్డి అడ్డుపెట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 17నెలల కాంగ్రెస్ పాలన గాలిమోటర్ పాలనలా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రతిదానిని ప్రజలు గనమిస్తున్నారని, ఈ ప్రభుత్వాన్ని ఎప్పుడు శిక్షించాలన్నా విషయంలో ప్రజలకు సంపూర్ణ అవగాహన ఉందన్నా రు. సీఎంకు, మంత్రులకు పాలనపై అవగాహన లేక అవాక్కులు, చెవాక్కులు పేలుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారెంటీలు, 420 అబద్ధపు హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి ప్రజలు కొద్ది రోజుల్లో బుద్ధి చెప్పడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై కాకుండా పాలన మీద దృష్టి పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించాలన్నారు.

# వడదెబ్బతో కూలీ మృతి

భూత్పూర్/ కోడేరు, ఏప్రిల్ 30 : భూత్పూర్ మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన పట్నం అంజమ్మ(57)వడ దెబ్బతో బుధవారం మృతి చెందింది. మంగళవారం వరి చేను కోత పనులకు వెళ్లి వచ్చి రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వారు ఇద్దరు పనులకోసం హైదరాబాద్‌కు వలస వెళ్లగా ఇంట్లో ఎవ రూ లేకపోవడంతో అస్వస్థతకు గురైన ఆమె మృతి చెందింది. ప్రభుత్వం మృతురాలి కుటుంబాన్నిఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), ఏప్రిల్ 30 : రైతులు కల్లాలో ఆరబోసుకున్న ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. బుధవారం కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామానికి వచ్చిన ఆయనకు ఆ గ్రామ రైతులు కొనుగోలు విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ఆలకు వివరించారు. రైతులకు సరిగా గన్నీబ్యాగులు ఇవ్వకుండా, ఒకవేళ ఇచ్చినా చిరిగిన బ్యాగులు ఇస్తున్నారని, కొనుగోలు సరిగా జరగటం లేదని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయంపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు జరగక కల్లాలు, రోడ్లపై ఆరబోసుకున్న రైతులు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అధికారులకు తెలిపారు. నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన గన్నీబ్యాగులు అందుబాటులో ఉంచాలని, వేగంగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా కొనుగోళ్లు పూర్తయిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేస్తూ, బోనస్ కూడా చెల్లించాలని సూచించారు.





